క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వర్ల ఉత్సవం


సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

నాతవరం: మండల కేంద్రం నాతవరంలో గౌరీపరమేశ్వర్లు ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల నడుమ పుర వీధుల్లో సారె ఊరేగించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భజనలు, తప్పెటగుళ్ల, కోటాటం తదతర కార్యక్రమాలు నిర్వహించారు.

164 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు : స్థానిక హైస్కూల్ వద్ద బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రమణ్యం 164 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు బీపీ, సుగర్ పరీక్షలు జరిపారు. ఏఎన్ఎం నళిని, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి


కింతలిలో గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

మాడుగుల రూరల్: ఉజ్వల గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలని కింతలి సర్పంచ్ మైచర్ల భవాని తెలిపారు. బుధవారం భారత గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో ఉజ్వల గ్యాస్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ సబ్సిడీపై అందిస్తున్న గ్యాస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు జామి చిన్న, వెలుగు వీవోఏ సుంకర శ్రీనివాసరావు, గ్యాస్ కంపెనీ ప్రతినిధులు గౌరీ శంకర్ తదతరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాలుర కబడ్డీ పోటీలు నేడు

దేవరాపల్లి: మండలంలోని ఎ. కొత్తపల్లిలో ముత్యమాంబ అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా స్థాయి బాలుర కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్టు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయని, విజేతలకు వరుసగా రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

అనుమానాస్పదంగా ఉన్న కారు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

రావికమతం: మట్టవానిపాలెం గ్రామం శివారులో కొన్ని రోజులుగా అనుమానాస్పదంగా ఉన్న కారును స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఐ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. కర్నాటక రిజిస్ట్రేషన్ కెఏ51ఎంఎఫ్9938 నంబరుతో ఉన్న వాహనం మట్టవానిపాలెం సమీపంలో కొన్ని రోజులుగా ఉందన్నారు. గంజాయి వ్యాపారులదేమోనన్న అనుమానంతో గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వారం రోజులుగా విచారణ చేస్తున్నామని చెప్పారు. కారు కోసం ఎవరూ రాలేదని, దీంతో స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో ఉంచామన్నారు. ఎవరైనా రికార్డులు తీసుకువస్తే తిరిగి ఇస్తామని చెప్పారు.

ఓఎల్ పురంలో వృద్ధురాలి అదృశ్యం

నర్సీపట్నం: మండలంలో ఒ.ఎల్.పురం గ్రామానికి చెందిన బొందల లక్ష్మి(60) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్టు రూరల్ ఎస్ఐ ధనుంజనాయుడు తెలిపారు. సంక్రాంతి పండగ సామగ్రి కొనుగోలు చేసుకుని వస్తానని ఆమె ఈ నెల 14వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె మనవడు ఎం.హరీషరావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

జజ్జనకరి జనారే.. ఊరూరా జాతరే

- గ్రామాల్లో ఘనంగా తీర్థాలు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సంక్రాంతి సందర్భంగా ఊరూరా తీర్థాలు నిర్వహిస్తున్నారు. సంబరాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భం భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. దీంతో పల్లెలు సందడిగా ఉన్నాయి.


కొత్తకోట కోటవీధిరామ కోవెలలో కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెం, గరుగుబిల్లి గ్రామాల గ్రామ దేవత దండుముత్యాలమ్మ తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, మొక్కులను చెల్లించుకున్నారు. గొండుపాలెంలో అమ్మవారి ఆలయంలో గ్రామ సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, మాజీ సర్పంచ్


ఎడ్ల పోటీల విజేతలకు బహుతులను అందజేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, బూరె బాబురావు


బహుమతులందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథరావు

బండారు రామస్వామిపాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మామిడికాయల నాయుడు తదితరులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు కానిస్టేబుళ్ల కూండ్రపు సత్యనారాయణమూర్తి, రమేష్ ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

రావికమతం: సంక్రాంతి పండగ అనంతరం గ్రామాల్లో ఘనంగా తీర్థాలు నిర్వహిస్తున్నారు. రావికమతంలో కంచిపాటివారి రామకోవెల తీర్థం, కొత్తకోటలో కోటవీధిరామకోవెల తీర్థం బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా ముగ్గులు వేశారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తోడపెద్దు ఊరేగింపు


గొండుపాలెంలో దండుముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న భక్తులు

నిర్వహించారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని విజయరామరాజుపేటలో బుధవారం సంసం పేరంటాల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సంసం పేరంటాల గుడికి వెళ్లి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పందాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. మంగళాపురం, కుముదాంపేట, వడ్డాది, సురవరం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తీర్థ మహోత్సవంలో పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీల విజేత 'అర్జునగిరి'

దేవరాపల్లి: మండలంలోని ఎస్.జి. నగరం నారితల్లమ్మ పేరంటాలు తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన హోరాహోరీగా సాగింది. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 12 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడు ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో కేజే పురానికి చెందిన కొయిలాడ మోహన్ ఎడ్లు, తృతీయ స్థానంలో నర్సయ్యపేట ఎడ్లు నిలిచాయి. నాల్గవ స్థానంలో లెక్కలవానిపాలెం ఎడ్లు, ఐదవ స్థానంలో లక్ష్మీపురం ఎడ్లు, ఆరవ స్థానంలో లెక్కలవానిపాలెం, ఏడు, 8వ స్థానాల్లో లక్కవరం ఎడ్లు నిలిచాయి. వరుసగా రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ. 12వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుతులను జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, స్థానిక గ్రామ పెద్దలు చేతులు మీదుగా అందజేశారు. తెల్లవారజాము నుంచి పలువురు భక్తులు, నాయకులు, ప్రజాప్రతినిధులు నారితల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజులు జరిపారు.


భక్తులకు ఆలయ ప్రాంగణంలో ప్రసాద వితరణ చేస్తున్న మూర్తి


రావికమతం కంచిపాటివారి రామకోవెల తీర్థం సందర్భంగా జరుగుతున్న ముగ్గుల పోటీలు


విజయరామరాజుపేట తీర్థంలో ఎద్దుల పరుగు పందెం

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'


కె.కోటపాడులో జరుగుతున్న వాలీబాల్ పోటీలు

కె.కోటపాడు : మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం..ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక హైస్కూల్ మైదానంలో బుధవారం షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు జరిగాయి. ఎ.కోడూరు హైస్కూల్ మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న ఆడుదాం..ఆంధ్రా పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు మైదానాలకు వస్తూ క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్నారు. పోటీలను పీడీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి: విజయవాడలో ఈ నెల 19న స్వరాజ్య మైదానంలో నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యుడు కాటపల్లి అప్పారావు కోరారు. బుధవారం ఇక్కడ విలేకర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాంస్య విగ్రహం, స్మృతివవాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా పాలన సాగిస్తూ రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు సీఎం జగన్ అగ్ర పీఠం వేసి గౌరవిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల పేదలకు సైతం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి అండగా నిలుస్తున్నారన్నారు. అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణ మహోత్సవంలో అంబేడ్కర్ వాదులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండలంలోని రాచపల్లి జంక్షన్‌లో ఉన్న కామేశ్వరమ్మ ఆలయం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. యోగక్షేమాలతోపాటు ప్రస్తుతం వారు స్థిరపడిన రంగాల గురించి అడిగి తెలుసుకున్నారు. తమతో చదువుకుని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారికి తమ వంతు సాయం చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గొలుగొండ: పాకలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం పూర్వ విద్యార్థుల కలుసుకున్నారు. 2006–07 బ్యాచ్‌కు చెందిన 50 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పట్లో పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు తెలిపారు. కేంద్రప్రభుత్వం రూపొందించిన క్యాలెండర్లను సిబ్బందితో కమిషనర్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ -సంకల్పయాత్రలో భాగంగా బుధవారం మున్సిపల్ స్టేడియంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. పేదల సంక్షేమానికి కేంద్ర పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఈ శిబిరంలో ఉచిత ఆధార్ కేంద్ర, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈ నారాయణరావు, వైద్యులు, వైద్య సిబ్బంది, బీజేపీ నాయకులు కాళ్ల సుబ్బారావు, చిందాడ నూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ నూతన పాలకవర్గం

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు గ్రామంలో గల వాసవీక్లబ్ నూతన పాలకవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడి ఆర్. కాంతారావు, కార్యదర్శిగా అనపగడ్డ శ్రీనివాసరావు, కోశాధికారిగా పుట్టా నాగేశ్వరావును క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్‌నేషనల్ పోగ్రాం సమన్వయకర్త శ్రీనాధు శ్రీనివాసరావు, ఇంటర్ నేషనల్ ట్రెజరర్ శ్రీనివాస్, జిల్లా వాసవీ క్లబ్ ఇన్‌చార్జి పుట్టా మల్లికార్జున్‌రావు, జోన్ ఇన్‌చార్జి గున్నయ్యశెట్టి, పుట్టా నానాజీ, పాల్గొన్నారు.

కారు ఢీకొని తాపీమేస్త్రి మృతి

కశింకోట : నరసింగబిల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి చెందాడు. సీఐ ఎం. వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం ..యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తూ నరసింగబిల్లి కూడలి వద్ద రోడ్డు దాటుతున్న మోపెడ్‌ను అదే మార్గంలో కారు వచ్చి ఢీకొంది. దీంతో మోపెడ్ నడుపుతున్న యలమంచిలి మండలం కొక్కిరాపల్లి వద్ద అగ్రహారానికి చెందిన సుందరపు సత్తిబాబు(57) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సొంత పని మీద తన గ్రామం నుంచి నరసింగబిల్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి పోస్టుమార్టంకు తలించినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల: పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో 15 గ్రామాల సర్పంచ్‌లతో పంచాయతీ అభివృద్ధిప్రణాళికపై రెండోవిడత ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంచాయతీల్లో జరగవలసిన అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, సూపరింటెండెంట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సీఎం సహాయ నిధి


మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అనారోగ్యంతో మృతి చెందిన నర్సీపట్నం మండలం, చెట్టుపల్లికి చెందిన తగరంపూడి సన్యాసిరావు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు జీవితాంతం రుణపడి ఉంటామని మృతుడు భార్య పద్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌వో సుర్ల శేఖర్, వైస్ఎంపీపీ తాతబాబు, మండల యూత్ నాయకులు దన్నిన నానాజీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజారావు, ఎంపీటీసీ మాకిరెడ్డి తాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం చేసిన వారిని అరెస్టు చేయాలి

నర్సీపట్నం: హత్యా ప్రయత్నం చేసిన వారిని అరెస్టు చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. కుల వివక్షతో హత్యా ప్రయత్నం చేసిన కేసుల్లో స్టేషన్ బెయిల్ రద్దు చేయాలన్నారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో దళిత యువకులు బి.రాజా, బి.తేజలపై కత్తితో దాడి చేసి, చంపే ప్రయత్నం చేయటం దారుణమన్నారు. ఈ దాడిలో రాజా తీవ్రంగా గాయపడిన కేజీహెచ్‌లో చావుబతుకుల మధ్యకొట్టిమిట్టాడుతున్నారన్నారు. నిందితుల స్టేషన్ బెయిల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిందితుల నుంచి బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలన్నారు. రాజాకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీపీశ్రీనివాసరావు

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండల పరిషత్ అధ్యక్షుడు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు శిక్షణ తరగతులను ప్రారంభించి, మాట్లాడారు. ఈవోపీఆర్ఆర్‌డీ నూకరాజు గ్రామ స్వరాజ్యం, పారిశుధ్యపనులు మెరుగు, పంచాయతీ నిధుల వినియోగంపై సూచనలు చేశారు. మాస్టర్ ట్రైనర్ సంతోష్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలు తీరు గురించి వివరించారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- భైలపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం


వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని భైలపూడిలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతి కుటుంబాన్ని కలిసి, బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం మనదని, అందుకే కులం,మతం,పార్టీ,ప్రాంతం,వర్గం అనే తేడా లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం గ్రామానికి మంజూరు చేసిన రూ.1.10 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద 90 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణం, ఇంటింటీ కుళాయి ఏర్పాటు పూర్తయిందని చెప్పారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించామని, వెంటనే పనుల చేపట్టాలని సూచించారు. గ్రామంలో లబ్ధిదారులకు రూ.1.25 కోట్లతో సంక్షేమ పథకాలు అందజేశామని చెప్పారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు డిప్యూటీ సీఎం తాజాగా రూ.10 లక్షలు కేటాయించారు. గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలని అధికారులను ఆదేశించారు. భైలపూడి నుంచి దిబ్బపాలెం, భైలపూడి నుంచి ఎ.అగ్రహారానికి తారురోడ్డునిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు సంతోషంగా జీవిస్తున్నామని చెప్పారు. మా పెద్దకొడుకు జగనే..మాకు ప్రతిరోజు బువ్వపెడుతున్నాడని ఆనందంతో డిప్యూటి సీఎం బూడి ముత్యాలనాయుడును వృద్ధులు,వికలాంగులు ఆలింగనం చేసుకుని హర్షం వ్యక్తం చేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి,వైఎస్సార్ విగ్రహాలకు బూడి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగతల్లి, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, బురే బాబురావు, యూత్ అధ్యక్షులు స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామా నేతలు జి.తారకేసు,జాజిమొగ్గల ఈశ్వరరావు,గొల్లవిల్లి సన్యాసిరావు తదితరులుపాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

చోడవరం రూరల్: జిల్లాలోని 18 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో నాలుగు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్‌తెలిపారు. 19,20,21,22 తేదీల్లో ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. సబ్బవరం నేషనల్ హైవే పరిధిలో మూడు చోట్ల 132 కేవీ టవర్లను ఏర్పాటు చేయనున్నామని, ఈ పనుల కారణంగా నాలుగు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. జిల్లాలోని కోటపాడు, వెంకన్నపాలెం, చోడవరం, బోయిల కింతాడ, దేవరాపల్లి, వారాడ, జన్నవరం, వడ్డాది, రాజాం, పోలేపల్లి, చీడికాడ, అప్పలరాజు పురం, మాడుగుల, ఎం.కోడూరు,గాధిరాయి, కస్బా జగన్నాథపురం, తట్టబంద, రావికమతం 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్ఈ పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన


వడ్డాది జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళనకు దిగిన యువకులు

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో యువకుల మధ్యన జరిగిన గొడవలో కోడి కత్తితో దాడి చేసి తేజను గాయపరిచిన వారిని పోలీసులు అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు యువకులు బుధవారం ఆందోళన చేశారు. మంగళవారం వడ్డాదికి చెందిన రెల్లివీధి,దొరబాబు కాలనీకి చెందిన యువకులు మధ్యన గొడవ జరిగింది. అదే రోజు రాత్రి మళ్లీ వడ్డాది సినిమాహాలు వద్ద గొడవ జరగ్గా తేజపై దొరబాబు కాలనీకి చెందిన యువకులు దాడి చేశారు. కోడి కత్తితో తేజ మెడపై గాయపరిచారు. తీవ్ర కర్తస్రావమైన తేజను ఆస్పత్రికి తరలించారు. విశాఖ కేజీహెచ్‌లో కోలుకుంటున్నాడు. తేజకు మద్దతుగా పలువురు యువకులు,కుటుంబ సభ్యులు,మహిళలలు వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేశారు. దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసికోవాలని నినాదాలు చేశారు. అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు,కొత్తకోట సీఐ అప్పలనాయుడు,ఎస్ఐ డి.ఈశ్వరరావులు తమ సిబ్బందితో వచ్చి దాడి చేసిన వారిపై చర్యలు తీసికుంటామని ఆందోళనకారులకు హామీ ఇచ్చారు. దాడి చేసిన పలువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసికుని విచారణ చేస్తున్నారు. తేజపై దాడి చేసిన యువకుల్ని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్టు తెలిసింది.